# ప్రచారానికి కేటీఆర్



చందుర్తి: మల్యాలలో సభాస్థలిని పరిశీలిస్తున్న మండల ఇన్‌చార్జి శ్రీధర్, మండలాధ్యక్షుడు ఎల్లయ్య

- నేడు వేములవాడ నియోజకవర్గంలో పర్యటన
- ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడకు మద్దతుగా రాక
- కథలాపూర్‌లో బీఆర్‌ఎస్ బహిరంగ సభకు హాజరు
- చందుర్తి, రుద్రంగి, వేములవాడ, తంగళ్లపల్లిలో రోడ్‌షోలు
- ఏర్పాట్లను పరిశీలించిన మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 1 4(నమస్తే తెలంగాణ)/కథలాపూర్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ నేడు వేములవాడ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి బహిరంగ సభతోపాటు రోడ్‌షోల్లో పాల్గొననున్నారు. హైదరాబాద్ నుంచి కామారెడ్డి, కోరుట్ల మీదుగా బుధవారం కథలాపూర్ మండలానికి చేరుకుంటారు. ఉదయం 11గంటలకు వరద కాలువ పక్కన మైదానంలో జరిగే కథలాపూర్, మేడిపల్లి మండలాల ప్రజా ఆశీర్వాద సభకు హాజరై ప్రసంగిస్తారు. కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాల పెద్ద సంఖ్యలో 12వేల మందికిపైగా సభలో పాల్గొననుండగా, ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ వొద్దినేని హరిచరణ్‌రావు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు రుద్రంగి, 01.30 గంటలకు చందుర్తి, 2గంటలకు కోనరావుపేట, 3.30గంటలకు వేములవాడ, 6గంటలకు తంగళ్లపల్లి మండలాల్లో రోడ్‌షో మండలాల్లో రోడ్‌షోలో పాల్గొంటారు. కాగా, ప్రచారంలో భాగంగా తమ మండలానికి మొదటిసారి వస్తున్న రామన్నను చూసేందుకు మేడిపల్లి, కథలాపూర్, భీమారం మండలాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

### కేటీఆర్ సభకు శరవేగంగా ఏర్పాట్లు

చందుర్తి, నవంబర్ 14: ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గ్రామ ప్రవేశ మార్గంలో గల మైదానంలో భారీ వేదికను ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి శ్రీధర్ దగ్గరుండి ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నానే. సుమారు పదివేల మందితో సభ జరగనుండగా, అసౌకర్యం కలుగకుండా తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఈర్లపల్లి రాజు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, వైస్‌ఎంపీపీ అబ్రహం, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ పెగ్గర్ల రమేశ్‌రావు, సెస్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ అశోక్, కేటీసీబీ డైరెక్టర్ కిషన్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, అధ్యక్షుడు కమలాకర్‌రావు ఉన్నారు.



వేములవాడలో బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్

# రేవంత్ ఓ అజ్ఞాని

- వ్యవసాయం దండుగన్న చంద్రబాబు శిష్యుడు ఆయన • రైతులపై కపటప్రేమను ప్రదర్శిస్తున్నడు • మోటర్లు ఏవి పెడుతరో తెలియకుండా మాట్లడుతున్నడు • 10 హెచ్‌పీ వాడితే మూడు గంటల కరెంటే చాలంటున్నడు
- మాయమాటల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సిందే • రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ధ్వజం
- వేములవాడలో బూత్ కమిటీ ఇన్‌చార్జిలు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో దిశానిర్దేశం • ఇంటింటికీ వెళ్లి అభివృద్ధిని వివరించాలని విజ్ఞప్తి

వేములవాడ, నవంబర్ 14: రేవంత్ రెడ్డికి వ్యవసాయం గురించి తెలియని ఓ అజ్ఞాని అని, అయినా నీళ్లను ఎత్తిపోసేందుకు మోటర్లు ఏవి వాడుతారో తెలియకుండా మాట్లాడుతున్నాడని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. రైతన్న చేసే వ్యవసాయమే దండగ అన్న నారా చంద్రబాబునాయుడు శిష్యుడు రేవంత్ రెడ్డి అని గుర్తు చేశారు. 10 హెచ్‌పీల మోటర్లు పెడితే మూడు గంటల విద్యుత్ సరిపోతుందని మాట్లాడడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. రైతులపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నాడని, అయినా రైతులెవరూ నమ్మరని స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని పండుగలా చేసి, అన్ని విధాలా ఆదుకున్న సీఎం కేసీఆర్‌కే మద్దతునిస్తారని చెప్పారు. వేములవాడలోని చల్మెడ నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన బూత్ కమిటీల ఇన్‌చార్జిలు, ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై, దిశానిర్దేశం చేశారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని వివరించడంతోపాటు కాంగ్రెస్ తీరును ఎండగట్టారు. రేవంత్‌రెడ్డి ఇంతకు ముందు మూడు గంటల కరెంటే చాలని అన్నాడని, ఇప్పుడేమో 10 హెచ్‌పీ మోటర్లు వాడితే సరిపోతుందని అంటున్నాడని మండిపడ్డారు. అసలు వ్యవసాయం గురించి, రైతుల గురించి ఏమీ తెలియకుండా మాట్లాడడం సరికాదని హితవు పలికారు. రాష్ట్ర విభజన జరిగిన రోజు మనకు 7778 మెగావాట్ల విద్యుత్ ఉండగా, సీఎం కేసీఆర్ పదేళ్లలో 28 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్‌ను అందిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్ లాంటి మహానగరాల్లో మూడు విడతలుగా పరిశ్రమలు నడుస్తున్నాయని, అందుకు సరిపడా విద్యుత్తును అందించడమే మన ప్రభుత్వం చేసిన పనితీరుకు నిదర్శనం అని గుర్తు చేశారు. సాగునీరు, 24గంటల విద్యుత్ అందడం, హైదరాబాద్ లాంటి మహానగరాల్లో వెలుస్తున్న పరిశ్రమల ద్వారా కూడా ఉపాధి అవకాశాలు పెరిగాయని, తద్వారా ఈ రోజు గల్ఫ్ దేశాలకు వలసలు తగ్గాయని చెప్పారు. కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రం ఇవ్వలేదని, మనమే కొట్లాడి తెచ్చుకున్నామని గుర్తు చేశారు. నాడు రైతులను అరిగోసపెట్టి, ఇప్పుడు మళ్లీ మాయమాటలతో వస్తున్న కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ రోజు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో చేసిన అభివృద్ధి కండ్ల ముందు కనిపిస్తున్నదని, గడపగడపకూ వెళ్లి చర్చించి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి అనుమానాలను నివృత్తి చేసినప్పుడే మనకు ఓటు వేస్తారని గుర్తుంచుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, ఆర్బీఎస్ పట్టణశాఖ అధ్యక్షుడు లైసెట్టి మల్లేశం, సహకార సంఘం అధ్యక్షుడు సల్మాన్ రెడ్డి, కౌన్సిలర్లు మారం కుమార్, నిమ్మశెట్టి విజయ్, జడల లక్ష్మి, కొండ పావని, జోగిని శంకర్, సిరిగిరి రాంచందర్, యాచమనేని శ్రీనివాసరావు, నరాల శేఖర్, ఇప్పపూల అజయ్, గోలి మహేశ్, కో ఆప్షన్ సభ్యులు కట్కూరు శ్రీనివాస్, బాబున్, నాయకులు రామతీర్థపు రాజు, పీచర భాస్కరరావు, ప్రసాద్‌రావు, జడల శ్రీనివాస్, కొండ కనకయ్య, కొండ నర్సయ్య, ముద్రకోల వెంకటేశం, ముప్పిడి శ్రీనివాస్, గడ్డమీద శ్రీనివాస్, కందుల క్రాంతి కుమార్, మాదాడి గజానందరావు, గూడూరి మధు, నీలం శేఖర్, రామతీర్థపు హరీశ్, రాపెల్లి శ్రీధర్, గోపు బాలరాజు, గన్నమనేని రామారావు, రేణికింద అశోక్, పోతు అనిల్ కుమార్, పరశురాములు గౌడ్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, వెంకట్ రెడ్డి, కర్ల శేఖర్, సంజీవ్ తదితరులు ఉన్నారు.



వేములవాడలో బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరైన కార్యకర్తలు



గన్నేరువరం: చొక్కారావుపల్లిలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు బొట్టు పెడుతూ, మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

# కాంగ్రెస్ మాయలో పడద్దు.. ఆగం కావద్దు

- ఆ పార్టీకి ఓటేస్తే కష్టాలు తెచ్చుకోవడమే • ఎన్నికలు రాగానే కవ్వంపల్లి వస్తున్నడు
- కరోనా సమయంలో ఎక్కడున్నడు • సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి
- మానకొండూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

గన్నేరువరం, నవంబర్14: 'కాంగ్రెస్ మాయలో పడి ప్రజలు ఆగం కావద్దు.. ఆ పార్టీకి ఓటేస్తే కష్టాలు కొని తెచ్చుకోవడమే.. 24 గంటలు కరెంటిచ్చే బీఆర్‌ఎస్ కావాలా? 3 గంటల కరెంటిచ్చే కాంగ్రెస్ కావాలా? రైతులే తేల్చుకోవాలి' అని మానకొండూరు బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సూచించారు. మంగళవారం ఆయన గన్నేరువరం మండలంలోని పీచుపల్లి, చొక్కరావుపల్లి, చాకలివానిపల్లి, మైలారం, హన్మాజిపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో కరెంటు, సాగునీరు, తాగునీటి కోసం అరిగోస పడ్డామని గుర్తు చేశారు. రైతులపై కాంగ్రెస్ విషం కక్కుతుందని, రైతుబంధు, రుణమాఫీ ఆపాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిందని మండిపడ్డారు. అరవై ఏండ్ల పాలనలో చేయని అభివృద్ధి ఇప్పుడు ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఎన్నికలు రాగానే కవ్వంపల్లి వస్తున్నాడని, కరోనా సమయంలో ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించారు. అభివృద్ధి చేసిన తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, మతానికి చెందిన 200 మంది బీఆర్‌ఎస్‌లో చేరగా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వెంకన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- పౌరసరఫరాల కమిషనర్ అనిల్‌కుమార్

కలెక్టరేట్/సిరిసిల్ల రూరల్, నవంబర్ 14: కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస మౌలిక వసతులు కల్పించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. కాగా జిల్లాలో ఉన్న అంకిరెడ్డిపల్లి, నేరెళ్ల, సారంపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను అనిల్‌కుమార్ తనిఖీ చేశారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. రైతుల కోసం కనీస వసతులైన తాగునీరు, చలవ పందిళ్లు, కూర్చోవడానికి కుర్చీలు, బెంచీలు అందుబాటులో ఉంచాలని, ధాన్యం డబ్బులు త్వరగా జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. అలాగే రగుడులోని శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులో తనిఖీ చేశారు. సమావేశంలో పౌరసరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, మేనేజర్ జితేంద్రప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నక్క శ్రీనివాస్, మిల్లర్ల సంఘం అధ్యక్షుడు చేపూరి నాగరాజు, పబ్బ నాగరాజు, మిల్లర్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

## జిల్లెల్లలో ₹1.60లక్షల నగదు సీజ్

సిరిసిల్ల రూరల్, నవంబర్ 14: తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులో మంగళవారం వాహన తనిఖీల్లో ₹లక్షా అరవై వేల నగదును సీజ్ చేశారు. సిద్దిపేట జిల్లా జక్కాపూర్‌కు చెందిన కారం కంటి నర్సయ్య కారులో వెళ్తుండగా, ఆపి తనిఖీ చేశారు. కారులో ₹90వేల నగదు లభించగా, సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. అదే విధంగా మరొక వ్యక్తి వద్ద ₹70వేల నగదు సీజ్ చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.